## క్లుప్తంగా

### ఇంటింటికీ వెళ్లి.. సమస్యలు తెలుసుకుని...



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కె.కె.రాజు

**సీతంపేట:** ప్రజా ప్రతినిధులే స్వయంగా గడప గడపకూ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడం గతంలో ఏ ప్రభుత్వం చేపట్టలేదని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం 26వ వార్డు శంకువానిపాలెం సచివాలయం పరిధి లలితానగర్‌లో వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాలు వివరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై ప్రజలు విశేష ఆదరణ చూపిస్తున్నారని తెలిపారు. జోనల్ కమిషనజర్ విజయలక్ష్మి, పార్టీ నాయకులు పోతు సత్యనారాయణ, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, పార్టీ నాయకులు పైడి రమణ, పాండవ శ్రీను, బొడ్డేటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 2.5 టన్నుల టమాటా విక్రయాలు



టమాటా విక్రయాలను పరిశీలిస్తున్న ఈవో కొండబాబు

**సీతమ్మధార:** సీతమ్మధార రైతుబజారులో రాయితీపై టమాటా కోసం వినియోగదారులు బారులు తీరారు. గురువారం కిలో టమాటా రూ.50కే విక్రయించేలా చర్యలు చేపట్టారు. మొదటి రోజు 6 టన్నులు, రెండో విడత 2.5 టన్నుల టమాటాను విక్రయించారు. వినియోగదారులు తమ ఆధార్ లేదా రేషన్ కార్డు జిరాక్స్‌ను కౌంటర్ వద్ద చూపించి టమాటాలు కొనుగోలు చేశారు. విక్రయించారు. మనిషికి ఒక కిలో టమాటా మాత్రమే విక్రయించారు. ఈవో కొండబాబు నేతృత్వంలో సహాయకుడు సతీష్ కౌంటర్ల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

### రైతుబజారు స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాళ్లు కేటాయిస్తున్న ఈవో కొండబాబు

**సీతమ్మధార:** సీతమ్మధార రైతుబజారులోని స్టాళ్లకు గురువారం ఈవో కొండబాబు డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు 63 స్టాళ్లకు డ్రా తీసినట్లు తెలిపారు. రైతులు వారికి కేటాయించిన స్టాళ్లలో వ్యాపారం నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో రైతుబజారు సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

### మొక్కల పెంపకం



మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు మాధ్యమం పాఠశాలలో రోటరీ క్లబ్ సభ్యులు గురువారం మొక్కలు నాటారు. పాఠశాలలో వాటర్ ఫిల్టర్, డిజిటల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు, అధ్యక్షుడు డి.ఎం.రావు, కార్యదర్శి రఘుపతి, బి.మధు, డి.శ్రీనివాస్, డాక్టర్ పద్మ, డాక్టర్ సుమన, బి.మణి పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులకు హెచ్‌ఎం కె.సలోమి కృతజ్ఞతలు తెలిపారు.



# 'జగనన్న సురక్ష'తో చెంతకే సేవలు

- ప్రతి తలుపూ తట్టండి.. ప్రజలకు నూరు శాతం అందేలా చూడండి
- సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- 44వ వార్డులో 1,006 ధ్రువపత్రాల అందజేత



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు, జెడ్సీ కృష్ణ



44వ వార్డులో జగనన్న సురక్ష శిబిరానికి హాజరైన లబ్ధిదారులు

**సీతంపేట:** ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం నూరు శాతం ప్రజలకు చేరేలా ప్రతి తలుపు తట్టాలని, ఈ బాధ్యత వలంటీర్లు, సచివాలయ అడ్మిన్లు, కార్యదర్శులదేనని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అబిద్‌నగర్ షాదీఖానాలో గురువారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల వద్దకే పరిపాలనలో ప్రభుత్వం మరో అడుగు ముందుకేసిందన్నారు. ప్రజలు తమకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్ల కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఈ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దే ధ్రువపత్రాలు అందుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో వలంటీర్‌కు కేటాయించిన అన్ని గృహాలను సందర్శించి జగనన్న సురక్ష ప్రయోజనాన్ని వివరించి, వారికి అవసరమైన సర్టిఫికెట్లు, సేవలు నూరు శాతం అందేలా చూడాలన్నారు. మైగ్రేట్ అయిన వారి స్థానంలో కొత్తగా వచ్చిన వారి వివరాలు సేకరించి వారికి కూడా సురక్ష ప్రయోజనం అందేలా చూడాలని కోరారు. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లతో క్లస్టర్ వారీగా జగనన్న సురక్ష అమలు తీరుపై కె.కె.రాజు సమీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లు అందజేశారు.

**ప్రజలంతా సద్వినియోగం చేసుకోండి**

కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ 44వ వార్డులోని ఆరు సచివాలయ పరిధిలో 1,091 జగనన్న సురక్ష టోకెన్లు మంజూరు చేయగా.. 24 గంటల్లో 1,006 సేవలు పూర్తి చేసి ధ్రువపత్రాలు అందజేసినట్టు తెలిపారు. వీటిలో 568 కుల, 403 ఆదాయ, 3 రేషన్ కార్డులు, 9 ఓబీసీ సర్టిఫికెట్లు ఉన్నాయన్నారు. క్యాస్ట్ సర్టిఫికెట్ కోసం ఎన్నో ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న తూర్పు కాపులకు జగనన్న సురక్ష ద్వారా వాటిని అందించామని చెప్పారు. ఈనెలాఖరు వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని బాణాల కోరారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ త్రినాధరావు, ఏపీడీ పద్మావతి, ఏఈ రమణమ్మ, స్థానిక నాయకులు హబీబ్, సీతారాం, హీర, పి.గోపి, హరిపట్నాయక్, మహాదాస్య గోపి, సుధాకర్ రెడ్డి, ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 987 ధ్రువపత్రాల అందజేత



24వ వార్డులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కె.కె.రాజు

**సీతమ్మధార:** నియోజకవర్గంలో నెల రోజుల పాటు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కోరారు. 24వ వార్డు నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ మండపంలో గురువారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. లబ్ధిదారులకు ఆయన కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా పరిపాలనను ప్రజల ఇంటి వద్దకే తీసుకెళ్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ అవసరమైన ధ్రువపత్రాలను ఈ క్యాంప్‌లో అందిస్తున్నట్లు చెప్పారు. సుమారు 987 మంది లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను కె.కె.రాజు చేతులు మీదగా అందించారు. కార్యక్రమంలో సాడి కేశవరెడ్డి, జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, డీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీరామ్మూర్తి, మండల కన్వీనర్ మురళీకృష్ణారెడ్డి, బి.రామిరెడ్డి, రఘురామరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### 'చేయూత'కు అర్హత సాధించాను



వైఎస్సార్ చేయూత పథకానికి అర్హత ఉన్నా.. క్యాస్ట్ సర్టిఫికెట్ లేక అనర్హురాలిగా మిగిలిపోయాను. జగనన్న సురక్ష వచ్చాక సచివాలయ సిబ్బంది మా ఇంటికి వచ్చారు. వారికి నా సమస్య చెప్పాను. ఆధార్ కార్డు వివరాలు తీసుకున్నారు. సర్టిఫికెట్ తీసుకోడానికి క్యాంప్‌కు రావాలని ఫోన్ చేశారు. నా చేతికి ధ్రువపత్రం అందజేశారు. నాలాంటి వారికి మేలు చేసిన జగన్‌బాబుకు రుణపడి ఉంటాను.

– ఆలిమా బేగం, ముస్లిం తాటిచెట్లపాలెం

### చాలా సంతోషంగా ఉంది



ఆదాయ ధ్రువపత్రం లేక చాలా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేయలేకపోయాను. అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే ఓపిక లేక ఊరుకున్నారు. మొన్న వలంటీర్ మా ఇంటికి వచ్చి అడిగారు. ఆదాయ సర్టిఫికెట్ ఇప్పించండని అడిగాను. వెంటనే మంజూరు చేయించి అందజేశారు. చాలా సంతోషం అనిపించింది.

– ఎస్‌కే చోటీబీబీ, పెద్దూరు

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**మురళీనగర్:** మర్రిపాలెం సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ ఈపీఎఫ్ సబ్‌స్టేషన్, మర్రిపాలెం వుడా లేఅవుట్ సబ్‌స్టేషన్, గ్రీన్ గార్డెన్స్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మర్రిపాలెం వుడా లేఅవుట్, శివశివానీ పాఠశాల, పోలీస్ క్వార్టర్లు, ఈపీఎఫ్ క్వార్టర్లు, లీడర్ ప్రెస్ ఏరియా, భాస్కర్ గార్డెన్స్, శివనగర్, శ్రీనివాస నగర్, హుస్సేన్ నగర్, రైల్వే క్వార్టర్స్, నరేంద్రనగర్, పార్వతీ నగర్, పంజాబ్ హోటల్ జంక్షన్, రైల్వే క్వార్టర్లు, శాంతినగర్, జర్నలిస్టు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

**హెచ్‌బీ కాలనీ, మద్దిలపాలెం ఫీడర్లలో..**

**సీతమ్మధార:** హెచ్‌బీ కాలనీ 11 కేవీ ఫీడర్, మద్దిలపాలెం 11 కేవీ ఫీడర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్–1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సంజయ్‌గాంధీ కాలనీ, హెచ్‌బీ కాలనీ, పాత వెంకోజీపాలెం, కృష్ణ కాలేజీ రోడ్డుతోపాటు చాకలి పేట, సైల్ క్వాటర్స్, ఆదర్శనగర్, సింహాద్రిపురం, వుడా అపార్ట్‌మెంట్, ఎల్‌ఐసీ, పాత ఏసీబీ కార్యాలయం ప్రాంతం, డాక్టర్స్ కాలనీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

### పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**దాబాగార్డెన్స్:** వర్షాకాలం దృష్ట్యా వార్డుల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా పోయేలా ప్రధాన గెడ్డల్లో వ్యర్థాలు తొలగించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి జోన్ పరిధిలో లోతట్టు ప్రాంతాలు గుర్తించి, అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

## డాక్టర్ వరప్రసాద్ సేవలు మరువలేనివి



డాక్టర్ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న శెట్టిబలిజ సంక్షేమ సంఘం ప్రతినిధులు

**సీతంపేట:** ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా డాక్టర్ కడలి సత్యవరప్రసాద్ అందించిన సేవలు మరువలేనివని శెట్టిబలిజ సంక్షేమ సంఘం పెద్దలు కొనియాడారు. ఇటీవల పదవీ విరమణ చేసిన వరప్రసాద్‌ను నగరంలోని ఆయన ఇంటి వద్ద గురువారం శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 5 కొత్త మెడికల్ కళాశాలలు మంజూరు చేయడం ద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లు, 612 పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు పెరగడానికి వరప్రసాద్ విశేష కృషి చేశారన్నారు. వైద్యులు, నర్సులు, పారా మెడికల్ వైద్య సిబ్బంది మొత్తం 3,530 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారని గుర్తుచేశారు. తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అనంతరం దుశ్శాలువాతో ఆయనను సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు జోగి ద్రోణ సూర్యారావు, వాసర్ల బాలకృష్ణ, కేతా గంగరాజు, కడలి శివకేశవ్, మామిడిశెట్టి రామకృష్ణ మూర్తి, కడలి సుబ్బారావు, డాక్టర్ చెల్లుబోయిన రాజీవ్ పాల్గొన్నారు.

### రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

**గోపాలపట్నం:** రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన డొపా సీతారామ్(అలియాస్ రాము) (50) ప్రైవేటు పనులు చేస్తూ కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. రెండు రోజుల క్రితం విజయనగరం జిల్లా చీపురుపల్లి వెళ్లిన అతడు ఈ రోజు ఉదయం తిరుగు ప్రయాణమయ్యాడు. సింహాచలం రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### 875వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

**కూర్మన్నపాలెం:** స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 875వ రోజుకు చేరుకున్నాయి. కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం తీరును మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## రేషన్ పంపిణీలో పొరపాట్లు జరిగితే చర్యలు



ధర్మానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు



కంచరపాలెం రేషన్ డిపోలో స్టాక్‌ను పరిశీలిస్తున్న కాంతారావు, అధికారులు.

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

**కంచరపాలెం:** చౌక ధరల దుకాణాల్లో, ఇంటింటికీ రేషన్ డెలివరీ వాహనాల ద్వారా సరకుల పంపిణీలో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు హెచ్చరించారు. కంచరపాలెం పరిధిలోని రేషన్ డిపోలు, రేషన్ వాహనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సివిల్ సప్లై, ఐసీడీఎస్ అధికారులతో కలిసి ఫుడ్ కమిషన్ సభ్యులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 54, 55వ వార్డుల్లోని రేషన్ దుకాణాల్లో బియ్యం స్టాక్ ఎంత వచ్చింది, ఎంత పంపిణీ చేశారు, ఎందరు కార్డ్ హోల్డర్స్ ఉన్నారు, రైస్ కార్డులు ఎన్ని ఉన్నాయి తదితర విషయాలను కాంతారావు అడిగి తెలుసుకున్నారు. కంచరపాలెం ధర్మానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్న భోజన పథకంతోపాటు పిల్లలకు గుడ్లు సరఫరా తదితర అంశాలను పరిశీలించారు. గోపాలపట్నంలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో సూర్యప్రకాశరావు, ఏఎస్‌వో మురళీధర్, సీడీపీవో అర్బన్ శ్రీలత, ఫుడ్ సేఫ్టీ అధికారి అప్పారావు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ధ్యాన మందిరంలో సేవా కార్యక్రమాలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న హాస్పిటల్ సిబ్బంది



అన్నదానంలో పాల్గొన్న భక్తులు, యాచకులు

**తాటిచెట్లపాలెం:** రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్న హారతి అనంతరం పేదలకు, భక్తులకు భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

**ఉచిత వైద్య శిబిరం..:** ధ్యాన మందిరం ఆవరణలో భక్తులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పినాకిల్ హాస్పిటల్ సిబ్బంది బీపీ, సుగర్ పరీక్షలు, వీ డెంటల్ సిబ్బంది దంత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వీ డెంటల్ డైరెక్టర్ కె.ఎం.రమేష్ మాట్లాడుతూ ఆహారపు అలవాట్ల వల్ల పంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. దంత సమస్యలు చిన్నగా ఉన్నపుడే చికిత్స చేయించుకోవాలని సూచించారు.

# స్ఫూర్తిప్రదాత జగ్జీవన్ రామ్

- బాబూజీ వర్ధంతిలో వక్తల నివాళి



జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్, అధికారులు



బాబూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు



కస్తూరినగర్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్

**సీతమ్మధార:** స్వాతంత్య్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ దేశ ప్రజలందరికీ స్ఫూర్తిప్రదాతని వక్తలు కొనియాడారు. బాబూజీ వర్ధంతి కార్యక్రమం గురువారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి సీఎండీ పృథ్వీతేజ్ పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబూజీ దేశానికి విశేష సేవలందించారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్ రామ్ అందించిన సేవలు ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, సూర్యప్రతాప్, బి.రమేష్ ప్రతాప్, చీఫ్ జనరల్ మేనేజర్లు అచ్చి రవికుమార్, వి.విజయలలిత, డి.సుమన్ కల్యాణి, ఒ.సింహాద్రి, జె.శ్రీనివాసరావు, సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో**

బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాజ్యాంగంలో రూపొందించిన అనేక సంస్కరణల అమలుకు బాబూజీ ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, రెయ్యి వెంకటరమణ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, డైరెక్టర్లు ఎస్.రవికుమార్, కె.సుశీల, పాండవ శ్రీను, పైడి రమణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**దళితుల ఆశాజ్యోతి**

**కంచరపాలెం:** దళితుల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్ రామ్ చేసిన కృషి ఎనలేనిదని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. 46వ వార్డు కస్తూరినగర్‌లో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. బాబూజీ సేవలను కొనియాడి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాపతి అప్పారావు, బి.గోవిందు, చిన్నారావు, కె.లావణ్య, జి.అప్పారావు, కె.రామారావు, ఎస్.కృష్ణ, బాల, కె.ఈశ్వరరావు, డేనియల్, శంకరరావు, వసంత, విజయలక్ష్మి, దేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## 23న గవర విద్యార్థులకు అభినందన సభ



కరపత్రికలు ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

**తాటిచెట్లపాలెం:** విద్యా రంగంలో ఉత్తమ ప్రతిభ చూపిన గవర సామాజిక వర్గ విద్యార్థులకు ఈ నెల 23న తాటిచెట్లపాలెం ఆశీర్వాద్ కల్యాణ మండపంలో అభినందన సభ నిర్వహించనున్నట్లు గౌరీ(గవర) సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. రైల్వే న్యూకాలనీలోని సంఘ కార్యాలయంలో గురువారం సంఘ అధ్యక్షుడు బుద్ధ శివాజీ ఈ వివరాలు వెల్లడించి, కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. గవర విద్యార్థినీ, విద్యార్థులను విద్యలో ప్రోత్సహించే నిమిత్తం ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని చెప్పారు. పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను వివిధ రంగాల ప్రముఖులచే, తల్లిదండ్రుల సమక్షంలో నగదు బహుమతి, మెమొంటో, మెరిట్ సర్టిఫికెట్లతో ఘనంగా సత్కరిస్తామన్నారు. గవర విద్యార్థులు ఈ నెల 15లోగా రైల్వే న్యూకాలనీలోని సంఘ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు, కోశాధికారి కొణతాల వరాహ కోటి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పెంటకోట సంజీవరావు నాయుడు, మల్ల శంకరరావు, పీల ప్రసాద్, శరగడం సత్యనారాయణ, వేగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడిని కబళించిన లారీ



ఘటనా స్థలంలో పూతి మహేష్ మృతదేహం, ప్రమాదానికి కారణమైన లారీ

**అక్కిరెడ్డిపాలెం:** బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన యువకుడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో యువకుడు సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందాడు. గాజువాక ఎస్‌ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంనకు చెందిన పూతి మహేష్(25) స్విగ్గీలో పని చేస్తున్నాడు. మహేష్ గురువారం ద్విచక్ర వాహనంపై గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్దకు రాగానే.. వెనుకనే వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో.. మహేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఏసీపీ త్రినాథ్, ఎస్‌ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని.. ప్రమాదంపై ఆరా తీశారు. వివరాలు సేకరించి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. లారీని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహేష్ అవివాహితుడు. అతని తల్లిదండ్రులు వీరఘట్టంలోనే ఉంటున్నారని ఎస్‌ఐ తెలిపారు.

### మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

**మర్రిపాలెం:** మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్నారని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, కంచరపాలెం పోలీసులు సంయుక్తంగా గురువారం దాడులు నిర్వహించారు. ఊర్వశి జంక్షన్ దరి బర్మాక్యాంప్ వద్ద ఓ మెడికల్ షాపులో తనిఖీలు చేయగా పెంటాజోసిన్, లేక్టేట్ (1ఎంఎల్) 850 ఇంజెక్షన్లు లభ్యమయ్యాయి. షాపు యజమాని గెద్దం కళ్యాణ్, ప్రసాద్, పెదపూడి రాంప్రసాద్ కలిసి ఈ ఇంజక్షన్లను విక్రయిస్తున్నట్టు తేలింది. వారిని అదుపులోకి తీసుకుని మత్తు ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

**డాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో అనంతరం పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు, ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.